# ప్రవృత్తి

## లింగా విజయలక్ష్మి

మానసిక వైద్య నిపుణురాలుగా మంచి అనుభవం గడించిన డాక్టర్ వింధ్యకి తన స్నేహితురాలైన స్రవంతిని పరిచయం చేసింది రేవతి. ఓ అరగంట తర్వాత రేవతి వెళ్ళిపోయింది.

పేషెంట్స్‌ని ఎలా ట్రీట్ చేయాలో డాక్టర్ వింధ్యకి బాగా తెలుసు. తన దగ్గరికి వచ్చే అనేక మానసిక రోగుల రుగ్మతల్ని ఆమె సత్వరంగా బాగు చేసింది.

పేషెంట్ సమస్య వినే ముందు ఆ పేషెంట్‌కి డాక్టర్ డాక్టర్‌లావో, యముళ్ళావో కనిపించకూడదు, ఓ స్నేహితుడిలా కనిపించాలి. అందుకే స్నేహపూర్వకంగా మాట్లాడుతూ ఆమెతో అర్ధగంట వరకు కులాసాగా కబుర్లు చెప్పింది డాక్టర్ వింధ్య.

ఉన్న బెరుకు కాస్తా పోయేసరికి వింధ్యతో నిర్భయంగా, నిస్సంశయంగా మాట్లాడసాగింది స్రవంతి.

ఆ విషయం, ఈ విషయం అయ్యాక యధాలాపంగా అడిగింది వింధ్య "ఇప్పుడు చెప్పండి — మీ సమస్య".

సాయంత్రపు చల్ల గాలులు పూల పరిమళాలను మోసుకొస్తూ ఆ లాన్‌లో కూర్చున్న ఆ యిద్దర్నీ ప్రేమగా పలకరిస్తున్నాయి.

సడెన్‌గా చెప్పింది స్రవంతి "నా మొదటి భర్త — రాజశేఖరం. ఆయన ఆత్మహత్య చేసుకోడానికి ఒక విధంగా నేనే కారకురాల్ని."

గతంలో ఎన్నో భయంకరమైన మానసిక సమస్యల్ని పరిష్కరించిన వింధ్య ఇలాటి విషయాలకు అలవాటు పడిపోవడం వల్ల పెద్దగా ఆశ్చర్యపడలేదు. "ఉహూ" అంటూ కాజువల్‌గా తల వూపింది.

శ్రవంతిది విచిత్రమైన ప్రవృత్తి. విచ్చల విడితనం ఆమె సొత్తు. స్రవంతి ఓ వ్యభిచారిణి అని నిస్సంశయంగా చెప్పొచ్చు. సాధారణంగా పెళ్ళికాకముందు తప్పటడుగు వేసినవాళ్ళల్లో చాలామంది పెళ్ళయిన తర్వాత జాగ్రత్త పడిపోతారు. కాని ఆమెది అలాటి మనస్తత్వం కాదు. పెళ్ళికి, కోరికకి ముడిపెట్టని తత్వం ఆమెది, తత్ఫలితంగా రాజశేఖరంతో పెళ్ళయిన తర్వాత కూడా తన కంటికి నచ్చిన వాళ్ళతో అక్రమ సంబంధాలు పెట్టుకొంది స్రవంతి. తర్వాత విషయం కాస్తా భర్తకి తెలిసింది. దాంతో మానసికంగా కృంగిపోయాడు రాజశేఖరం. ఆమెనేమీ చెయ్యలేక ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ తర్వాత రాజశేఖరం స్నేహితుడూ — వ్యాపారవేత్త అయిన తరుణ్ స్రవంతికి బ్రతుకు తెరువు చూపడం కోసం ఆమెని తన పర్సనల్ అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. కాలగమనంలో అతడికి ఆమెతో అక్రమ సంబంధం కలిసింది. ఆ విషయం తెలిసి గర్భవతి ఐన తరుణ్ భార్య అతడికి విడాకులిచ్చి వెళ్ళిపోయింది. ఆ షాక్ లోంచి తేరుకున్నాక తరుణ్ స్రవంతిని పెళ్ళి చేసుకున్నాడు

కొంతకాలం వరకు వాళ్ళ సంసారం హేపీగా గడిచింది. తరుణ్ కి వ్యాపారంలో మంచి లాభాలు వస్తున్నాయి. కొత్తగా కొన్న దారాల ఫ్యాక్టరీని బాగా డెవలప్ చేస్తున్నాడు. అలాటి సమయంలో...

**పెళ్ళికాకముందు తప్పటడుగు వేసినవాళ్ళల్లో చాలామంది పెళ్ళైన తరువాత జాగ్రత్త పడిపోతారు. కాని స్రవంతిది అలాంటి మనస్తత్వం కాదు. పెళ్ళికి, కోరికకి ముడిపెట్టని తత్వం ఆమెది. ఫలితంగా పెళ్ళైన తరువాత కూడా ...**

ఎందుకో తెలీదుగాని గత కొద్ది రోజులుగా అతడు మానసికంగా కృంగి పోతున్నాడు. బిజినెస్ వ్యవహారాలు సరిగ్గా చూడకపోవడం వల్ల నష్టాలు వస్తున్నాయి.

అంతా వివరించి చివరగా చెప్పింది స్రవంతి "నాటు వ్యవహారాలు మానుకోవాలనుకుంటున్నాను కాని మానలేక పోతున్నాను. మానసికంగా ఆయన కృంగిపోవడానికి నేనే కారణమా! అని కూడా భయం వేస్తోంది." ఈ సమస్యకి పరిష్కారం ఏమిటన్నట్టుగా చూసిందామె.

భారంగా నిట్టూర్పి క్షణం తర్వాత అంది వింధ్య "మీ ప్రవృత్తి మీ భర్తకు తెలిసిందనడంలో ఎలాంటి సందేహం లేదు." కుర్చీలోంచి పైకి లేచి లాన్‌లో అటు యిటు పచార్లు చేయసాగింది. ఆ పది నిముషాలు అసహనంగా కూర్చుంది స్రవంతి.

తిరిగి కుర్చీలో కూర్చుంటూ అడిగింది వింధ్య "మీ రెండో భర్త భార్య పేరు"? "అసలు పేరు నాకు తెలీదు. ఆమెని నేనింతవరకు చూడలేదు. విడాకులు తీసుకున్న తర్వాత — ఆమెకి సంబంధించిన ఏ వస్తువూ ఇంట్లో లేకుండా చేశాడు తరుణ్. ఆమె పేరే ఎత్తనిచ్చేవాడు కాదు. పెళ్ళికాకముందు తరుణ్ ప్రవరాఖ్యుడిలా వుండేవాడట. అది తెలిసి ఆమె తరఫు వాళ్ళు ఆమెని 'వరూధిని' అని పిలిచేవారట. అప్పటి నుంచి ఆమెకా పేరే స్థిరపడిపోయిందట".

"మరి ప్రవరాఖ్యుడు మన్మథుడెలా అయ్యాడో .." వింధ్య మాటలకి స్రవంతి సిగ్గుతో తల దించుకుంది.

రెండు గంటలు ఆమెని ఇంటర్వ్యూ చేసిన అనుభవంతో "ఐకెన్ అండర్‌స్టాండ్" తల పంకించి చెప్పింది వింధ్య.

"భార్య నుంచి విడాకులు తీసుకుని నిన్ను పెళ్ళాడేడంటే అతన్ని నువ్వెంత బాగా ఆకట్టుకున్నావో అర్థమౌతూనే వుంది. కాని అది అంతటితో సరిపెడితే బావుండేది, కాని, నువ్వలా చెయ్యలేదు. నీ విశృంఖల మనస్తత్వం. మరికొందరికి నీ శరీరాన్ని పంచావు. అది తెలిసిన తరుణ్ బాంబేల్లో బిజినెస్ చాలించి హైద్రాబాద్ వచ్చేశాడు. అయినా నువ్వు మారకపోయే సరికి — 'లోపం' తనలోనే వుందేమోననే అనుమానాన్ని పెంచుకున్నాడు. అది పెనుభూతమై కూర్చుంది. పైగా తన భార్యకు విడాకులిచ్చి తొందరపడ్డాననే బాధ కూడా అతన్ని పీడిస్తూ వుండొచ్చు. కాని ముఖ్య కారణం నువ్వే. నిన్ను అమితంగా విశ్వసించడంవల్ల అదికాస్తా వమ్ము కావడంతో తరుణ్ మానసికంగా కృంగిపోతున్నాడు.

"ఇప్పుడు నేనేం చెయ్యాలి" మెల్లగా అడిగింది స్రవంతి.

"శాశ్వతంగా నువ్వు అతనితోనే ఉండాలనుకుంటున్నావా?" ఎదురు ప్రశ్నించింది వింధ్య. ఆమె తటపటాయింపు చూసి చెప్పింది "నిజాలు చెబితే తప్ప నేను సరైన ట్రీట్‌మెంట్ చెయ్యలేను."

తల దించుకుని చెప్పింది స్రవంతి. "ఈ మధ్యనే నాకు రాబర్ట్ అనే అమెరికన్‌తో పరిచయమైంది. అతను మరో నెలలో అమెరికా వెళ్ళిపోతున్నాడు. అతనితో కలిసి వెళ్ళిపోవాలనుంది. తరుణ్ గురించి కూడా ఆలోచించి కాస్త వెనకాడుతున్నాను. అందువల్ల కొన్ని నెలయిగా నేను కూడా మానసికంగా కృంగిపోతున్నాను."

తల వూపింది స్రవంతి.

పది నిముషాలు దీర్ఘంగా ఆలోచించింది వింధ్య.

''తరుణ్‌కి నువ్వు మనస్ఫూర్తిగా మేలు చెయ్యాలను కుంటున్నావా?

అయితే నేను చెప్పినట్టు విను. నువ్వు తరుణ్ తోనే వుండాలనుకుంటే అతను ఏదోక రోజు రాజశేఖరంలా ఆత్మహత్య చేసుకోవచ్చు, లేదా — నీ మీద కక్షతో నిన్ను చంపనూవచ్చు. ఉన్న విషయం చెబుతున్నందుకు క్షమించు. నువ్వు ఇక్కడ పుట్టాల్సి న దానివి కాదు. అమెరికాలో పుట్టాల్సిన దానివి. నీ జీవితానికి తగిన దేశం అమెరికాయే. కనుక, ఇక ఏ సందేహాలు పెట్టుకోకుండా రాబర్ట్‌తో కలిసి అమెరి కా వెళ్ళిపో. కాని వెళ్ళేముందు తరుణ్‌ని నేను చెప్పిన వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళు.

ఆ డాక్టర్‌కి నేనంతా చెబుతాను. ఆయన తరుణ్‌ని మానసిక రుగ్మత నుంచి తప్పిస్తాడు. అప్పుడు తరుణ్ తనే స్వయంగా నిన్ను రాబర్ట్ దగ్గరికి పంపిస్తాడు.''

తలవూపి ఆమె దగ్గర శెలవు తీసుకుంది



స్రవంతి. ఎందుకో తెలీదుకాని వింధ్య కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

* * *

తన కూతురు సంధ్యని తయారుచేసి కాన్వెంట్‌కి పంపించి, తను హాస్పిటల్‌కి వెళ్ళటానికి రెడీ అవుతోంది డాక్టర్ వింధ్య.

ఆ సమయంలో అక్కడి కొచ్చారు — రేవతి, స్రవంతి.

వింధ్య చెప్పినట్టే చేయటం వల్ల తరుణ్ మానసిక రుగ్మత నుంచి పూర్తిగా కోలుకున్నాడు. తనే స్వయంగా స్రవంతిని రాబర్ట్ దగ్గరికి పంపించేశాడు. ఆ సంతోషంలో వింధ్యకి కృతజ్ఞతలు చెప్పుకోవడానికొచ్చింది స్రవంతి.

ఇంతకు ముందులా లేదామె. మనిషిలో కూడ చాల మార్పు వచ్చింది. హుషారుగా వుంది. ఆమెని అభిమానంగా చూసింది వింధ్య.

"మీ ట్రీట్‌మెంట్ వల్ల నా మనసు కుదుటపడింది. మీకు చాలా ఋణపడి వున్నాను." అంది స్రవంతి.

జవాబుగా నవ్వింది వింధ్య.

స్రవంతి వెళ్ళిపోయిన తర్వాత వింధ్య కళ్ళల్లో ఉబికిన కన్నీళ్ళు కంగారుగా తుడుచుకుందామె. కాని రేవతి దృష్టి నుంచి తప్పించుకోలేక పోయింది.

ఈ వింత ప్రవర్తన అర్థంకాక అడిగింది రేవతి. చెబితే కాని కుదరదనటంతో చెప్పక తప్పలేదామెకి.

"స్రవంతి కథలో 'వరూధిని' ఎవరో కాదు నేనే!" వింధ్య జవాబు విని స్టన్ అయిపోయింది రేవతి. చాలాసేపటి వరకు తేరుకోలేక పోయింది. ఆమె వైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఓ గాడ్! నీ భర్తకి నువ్వు దూరం కావడానికి కారకురాలైన స్రవంతికి ఇంతటి మేలు ఎలా చెయ్యగలిగావ్?!"

"అది నా వృత్తి ధర్మం".

"కాదు. కానేకాదు, అది నీ మంచితనం."

బాధతో ఆమె గుండె బరువెక్కింది.

"ఇప్పటికైనా మీ భార్యా భర్తలు ఒకటైతే సంతోషిస్తాను".

"ఆత్మాభిమానం అనేది ఒకటుంది కదా! అది మనిషిని ఎలాగైనా ఆడిస్తుంది. నాకు నేముగా వెళితే తిరిగి తరుణ్ ప్రవృత్తి మారుతుంది. అతని మంచిని కోరేదాన్ని కనుక నేను వెళ్ళను. అతడు పశ్చాత్తాపంతో వస్తే — మేం తిరిగి ఒకటౌతాం. చూద్దాం, 'విధి' అనేది ఒకటుంది కదా!" వింధ్య కళ్ళల్లో తెరచాపల్లా కదలాడాయి కన్నీటి పొరలు.

ప్రవృత్తి గురించి చెప్పాలంటే వింధ్య పర్వతాలంత ఉన్నతమైనది. వింధ్య అయితే. సముద్రమంత లోతైనది — స్రవంతి.

మంచి, చెడులకు ప్రతిరూపాలు వింధ్య, స్రవంతి.

తనకు వైద్యం చేసి బాగు చేసింది తన కారణంగా తన భర్తకు దూరమైన 'స్త్రీ' అని తెలిస్తే స్రవంతి ఎలా రియాక్ట్ అయ్యేదో అనే ఆలోచన వచ్చేసరికి వింధ్యకి చేతులెత్తి నమస్కరించాలనిపించింది — రేవతికి. *



## శిక్ష?

"నీకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష వేస్తున్నాము!" అన్నాడు జడ్జి.

రెండేళ్ళనుంచి ఈ కేసుకోసం కోర్టుచుట్టూ తిరిగిన నాకు అదేం పెద్ద శిక్ష కాదులేండి! అన్నాడు జోగులు!

—డా. కె.నరేందర్
(గోదావరిఖని)

